ప్రజాశక్తి
శుక్రవారం 3 మార్చి 2023 5 విజయనగరం



ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపల్‌గా నాగలక్ష్మి



నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా ప్రముఖ మృదంగం విద్వాంసురాలు డాక్టర్ మండపాక నాగలక్ష్మి నియమితులయ్యారు. ఈమేరకు గురువారం ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సిఇఒ మల్లిఖార్జున ఉత్తర్వులు జారీ చేశారు. నాగలక్ష్మి ఆంధ్ర యూనివర్సిటీలో బిఎ మ్యూజిక్, పద్మావతి యూనివర్సిటీలో ఎంఎ మ్యూజిక్ ఓకల్ చేసారు. విశాఖపట్నంలో ముళ్లపూడి శ్రీరామ్మూర్తి వద్ద 8ఏళ్లు, చెన్నైలో ఆరేళ్లు సంగీత విద్యను అభ్యసించారు. ఆలిండియా రేడియోలో ఎ-గ్రేడ్ విద్వాంసురాలుగా గుర్తింపు పొందారు. 1992 నుంచి విజయనగరం మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో మృదంగం విద్వాంసురాలుగా విధులు నిర్వహిస్తున్నారు. కళాశాల 16వ ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు.

బండ బాదుడుపై భగ్గుమన్న జనం

పెంచిన గ్యాస్ ధరలపై సిపిఎం నిరసనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దేశ ప్రజలపై భారాలు మోపుతూ వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.50, కమర్షియల్ సిలిండర్‌పై రూ.350 రూపాయలు పెంచుతూ మోడీ ప్రభుత్వం చేసిన నిర్ణయం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన గురువారం జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల నిరసనలు తెలిపారు. పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ విజయనగరం రామకృష్ణానగర్ లో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ మోది బిజెపి ప్రభుత్వం ప్రజలు, మధ్య తరగతి ఉద్యోగులపై భారాలు వేసి పెట్టుబడి దారులైన ఆదాని, అంబానీలకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తున్నారని దుయ్యబట్టారు. తక్షణమే పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని, లేదంటే దేశప్రజలు బిజెపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో పి.రమణమ్మ, ఎం.శాంతమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు ఆధ్వర్యంలో జిల్లా విద్యుత్ స్టోర్స్ హమాలీలు ఆందోళన చేశారు. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు కెల్ల గోవింద, పతివాడ పెద రాంబాబు, కలిశెట్టి శ్రీను, మీసాల లెనిన్ తదితరులు పాల్గొన్నారు.



విజయనగరంటౌన్.. గ్యాస్ సిలిండర్లతో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, నగర ప్రజలు

బొబ్బిలి : గ్యాస్ ధర పెంపునకు వ్యతిరేకంగా పట్టణంలోని చిక్కాలరెల్లివీధిలో సిపిఎం ఆధ్వర్యాన కట్టెలపై వంట చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు పి.శంకరరావు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, మహిళలు పాల్గొన్నారు.

రామభద్రపురం : మండల కేంద్రంలోని సాలూరు రహదారిలో సిపిఎం మండల కార్యదర్శి బలస శ్రీను ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఆ పార్టీ కార్యకర్తలు భవానీ, శ్యామల, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని బొద్దాం కూడలిలో సిపిఎం ఆధ్వర్యాన రెండు గంటలపాటు రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చల్లా జగన్, కార్యకర్తలు చలుమూరి శ్యామ్, సుకురు గంగులు, గట్టు గోవింద, వెంకటసత్తి పాల్గొన్నారు.

గజపతినగరం : మండల కేంద్రంలోని మెంటాడ రోడ్డులో సిపిఎం ఆధ్వర్యాన గ్యాస్ సిలిండర్‌కు పూజ చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.లక్ష్మి, నాయకులు జి.శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు టి.పైడిపునాయుడు, సూర్యనారాయణ, కృష్ణ, డి.రాము, బి.రాము, గణేష్, లక్ష్మణ, తదితరులు పాల్గొన్నారు.





గజపతినగరంలో సిలిండర్‌కు పూజలు చేస్తూ, బొబ్బిలిలో కట్టెల పొయ్యిపై వంట చేస్తూ నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, మహిళలు



వేపాడ.. బొద్దాం కూడలిలో రాస్తారోకో చేస్తున్న సిపిఎం నాయకులు, స్థానికులు

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- 72 పోలింగ్ కేంద్రాల నుంచి వెబ్‌కాస్టింగ్
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్
- ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

ఈ నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లపై తన ఛాంబర్‌లో నోడల్ అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలింగ్ సిబ్బందిపై సమీక్షిస్తూ, ఒపిఒలుగా మహిళా ఉద్యోగులను నియమించాలని సూచించారు. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి, సిబ్బంది రవాణాకు ఇబ్బంది పడకుండా తగినన్ని వాహనాలను ఏర్పాటు చేయాలన్నారు. బ్యాలెట్ పేపర్ మడతపెట్టే విధానంపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని సూచించారు. ఐదు అంతకంటే ఎక్కువ పోలింగ్ బూత్‌లు ఉన్నచోట్ల, అదనంగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ బూత్‌లోకి మీడియాకు అనుమతి లేదని స్పష్టం చేశారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న 72 పోలింగ్ కేంద్రాలనుంచీ వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమును ఏర్పాటు చేసి, వెబ్‌కాస్టింగ్ ద్వారా ప్రతీ పోలింగ్ కేంద్రాన్ని, ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డిఆర్ఒ ఎం.గణపతిరావు, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇతర నోడల్ అధికారులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

న్యాయవాదిగా నారీమణి కి రక్షణ లేకపోవడం సిగ్గుచేటని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ ఒక ప్రకటన లో పేర్కొన్నారు. న్యాయవాది గోదావరి మధుబాబు తన భార్య సుప్రియను 13 ఏళ్ల పాటు గదిలో బంధించి చిత్ర హింసలకు గురి చేయడం సభ్యసమాజం సిగ్గుతో తల దర్శించుకునే చర్య అని వ్యాఖ్యానించారు. మహిళల రక్షణ కోసం వృత్తి పరంగా పోరాడాల్చిన న్యాయవాదులు ఈ విధంగా చేయడం సమంజసం కాదన్నారు. ఇటువంటి వారిని, అండగా నిలిచిన కుటుంబ సభ్యులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, ఆ న్యాయవాదిని బార్ కౌన్సిల్ నుంచి తప్పించాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. సిఐటియు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ నుంచీ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పతుందని విమర్శించారు. రామభద్రపురం, బొబ్బిలి మండలాల్లో వాలంటీర్లతో పట్టభద్రుల ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసి ప్రలోభాలకు గురిచేస్తున్నారని విమర్శించారు. అధికార పార్టీ అధికార దుర్వినియోగంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు మణికుమార్ ఉన్నారు.

విద్యుత్ శాఖ జెఇ శివశంకర్ సస్పెన్షన్

విజయనగరం టౌన్ : ఎపి ఇపిడిసిఎల్ బొబ్బిలిలో జెఇగా పని చేస్తున్న జి.శివశంకర్ ను విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.నాగేశ్వరరావు ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. బొబ్బిలిలో ఎటువంటి అనుమతులు, మంజూరు లేకుండా మరడాన శంకరరావు నుంచి రూ.1,28,457ను జెఇ వసూలు చేశారు. విద్యుత్‌శాఖ అనుమతులు, మంజూరు లేకుండా డబ్బులు వసూలు చేసి అక్రమాలకు పాల్పడడంతో సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ శాఖలో ఎటువంటి అక్రమాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని ఎస్‌ఇ తెలిపారు.

పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతం

ఎస్‌పి ఎం.దీపిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి ఎం.దీపిక

ప్రజాశక్తి-విజయనగరం

పెండింగ్‌లోఉన్న పోక్సో, గ్రేవ్ కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్‌పి ఎం.దీపిక ఆదేశించారు. జిల్లా పోలీసు అధికారులతో గురువారం వార్షిక నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నిందితులకు 41 సిఆర్‌సి నోటీసులు ఇచ్చే సమయంలో సుప్రీం కోర్టు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. వివిధ కోర్టుల్లో విచారణలో ఉన్న కేసుల్లో నిందితులు తప్పనిసరిగా శిక్షింపబడే విధంగా సంబంధిత సిఐలు, ఎస్‌ఐలు కొన్నింటిని ప్రాధాన్యత కేసులుగా గుర్తించి, ఆయా కేసుల్లో ప్రాసిక్యూషను త్వరితగతిన పూర్తి చేసి, నిందితులు త్వరితంగా శిక్షింపబడే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈనెల 13న జరగబోవు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికను సజావుగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలింగు రోజున పోలింగ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసేందుకు సంబంధిత రెవెన్యూ అధికారుల నుండి అనుమతులు పొందాలని, 200మీటర్లు దూరం వరకు ఎటువంటి షామియానాలు లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు.

సమావేశంలో ఎస్‌ఐబి అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్, విజయనగరం ఇన్‌ఛార్జి డిఎస్‌పి ఆర్. శ్రీనివాసరావు, దిశ స్టేషన్ డిఎస్‌పి ఎం.వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ డిఎస్‌పి ఎల్.మోహనరావు, ఎఆర్ డిఎస్పీ ఎల్. శేషాద్రి, సిఐలు, ఎస్‌ఐలు, తదితరులు పాల్గొన్నారు.


ఖాతాదారుల సేవా కేంద్రంలో ...

రూ.9 వేలు తినేశారు

కోమటిపల్లి వృద్ధుడు సారిపల్లి కృష్ణ ఆవేదన

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ పక్కనున్న ఆ బ్యాంకు ఖాతాదారుల సేవా కేంద్రంలో అక్రమాలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి. బ్యాంకు ఖాతాలో ఉన్న నగదు రూ.2 వేలు తీసేందుకు గతేడాది నవంబర్ 19న ఖాతాదారుల సేవా కేంద్రానికి వెళ్తే వేలిముద్ర తీసుకుని, రూ.9 వేలు విత్‌డ్రా చేసి డబ్బులు రావడం లేదని ఇంటికి పంపించేశారని బొబ్బిలి మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన వృద్ధుడు సారిపల్లి కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా వస్తున్న పింఛను సొమ్ము బ్యాంకులో దాచుకుంటే సేవా కేంద్రం నిర్వాహకులు తీసేయడంతో వైద్యానికి, ఖర్చులకు డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. ఖాతాదారుల సేవా కేంద్రం నిర్వాహకుడిపై బ్యాంకు మేనేజర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తన డబ్బులు తిరిగి ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కృష్ణ అధికారులను కోరుతున్నారు.



బ్యాంకు బుక్ చూపిస్తున్న వృద్ధుడు

మున్సిపల్ కార్మికులపై నిర్లక్ష్యం

తెల్లవారుజామున నగరంలో ఏ మూలకు వెళ్లినా కనిపించేది మున్సిపల్ కార్మికులే. నగర ప్రజలు నిద్రలేవకముందే రోడ్లపై, ఇళ్లు, వ్యాపార సంస్థల ముందు ఉన్న చెత్తను తుడిచి పరిశుభ్రంగా ఉంచుతారు. ప్రజారోగ్యాన్ని కాపాడమే కర్తవ్యంగా పనిచేస్తుంటారు. అలాంటి కార్మికులకు రావాల్సిన వేతనాలు, పారిశుధ్య పనులకు కావాల్సిన పనిముట్లు ఇవ్వడంలో నగర పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య కూడా పెంచడం లేదు. దీంతో ఉన్నవారిపైనే పనిభారం పెరుగుతోంది.

- విడుదల కాని హెల్త్ అలవెన్స్ బకాయిలు
- యూనిఫారాలకు నోచుకోని కాంట్రాక్టు కార్మికులు
- పూర్తి స్థాయిలో అందని పనిముట్లు



పనిముట్లు లేకుండా విధులు నిర్వహిస్తున్న కార్మికుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం కార్పొరేషన్‌లో 480 మంది కార్మికులు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. మరో 200 మంది వరకు రెగ్యులర్ కార్మికులున్నారు. గత పదేళ్లుగా ఇదే కార్మికులు నగరంలో పారిశుధ్య పనులు చేపడుతున్నారు. వీరికి రూ.15 వేలు వేతనంతోపాటు హెల్త్ ఆలవెన్స్ కింద రూ.6 వేలు ఇవ్వాల్సి ఉంది. హెల్త్ అలవెన్సులు నాలుగు నెలల నుంచి నగర పాలక సంస్థ కార్మికులకు చెల్లించాల్సి ఉంది. 480 మంది కార్మికులకు రూ.1.15 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం మార్చితో ముగియనుంది. మార్చి నెలాఖరికి బకాయిలు వస్తాయో? రావో? అనే ఆందోళనలో కార్మికులున్నారు.

యూనిఫాం లేకుండానే విధులు

నగర పాలక సంస్థ పారిశుధ్య కార్మికులకు ఏడాదికి రెండు జతలు యూనిఫాం ఇవ్వాలి. ప్రతి ఏడాది బోగి ముందు రోజు యూనిఫాం అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి ముగిసినా ఇంతవరకు యూనిఫాం అందించలేదు. దీంతో యూనిఫాం లేకుండానే కార్మికులు పనులకు హాజరు కావాల్సి వస్తోంది. రెగ్యులర్ కార్మికులకూ ఈ ఏడాది యూనిఫాం అందించలేదు.

అరకొర పనిముట్లతో..

పారిశుధ్య కార్మికుల విధి నిర్వహణకు యూనిఫాంతో పాటు చేతికి గ్లౌజులు, సబ్బులు, షూ, చీపుర్లు, కొబ్బరి నూనె వంటి పని ముట్లు ఇవ్వాలి. వీటిని అరకొరగా ఇచ్చి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. దీంతో మాస్కులు, గ్లౌజులు, షూ లేకుండా కాలువల్లో దిగి శుభ్రం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో కార్మికులు అనేక రోగాల బారిన పడి చివరికి మరణాలకు గురవుతున్నారు.

భర్తీ కాని ఖాళీలు

గత కరోనా కాలం నుంచి నగర పాలక సంస్థలో పని చేస్తున్న ఏడుగురు కార్మికులు అనారోగ్యం బారిన పడి మరణించారు. చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను గతంలో నియమించేవారు. కానీ రెండేళ్లుగా ఈ పోస్టులు భర్తీ చేయాలని కార్మిక సంఘాలు నాయకులు, కార్మికులు కోరుతున్నా పట్టించుకోవడం లేదు. వాస్తవానికి పెరిగిన నగర విస్తీర్ణం, జనాభా బట్టి మరో 500 మంది కార్మికులు అవసరం. కానీ ఉన్న కార్మికులతోనే పారిశుధ్య పనులు చేయించి మరింత పని భారాన్ని పెంచుతున్నారు.

హెల్త్ అలవెన్సులు చెల్లించాలి



నగర ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న మాకు రావాల్సిన హెల్త్ అలవెన్సులు ఇవ్వకపోవడం సరికాదు. పని భారాన్ని తగ్గించాలి. పని ముట్లు సరఫరా చేయాలి. ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి. వెంటనే హెల్త్ అలవెన్సులు చెల్లించాలి.

- బి.భాస్కరరావు,కార్మికుడు

పనిముట్లు ఇవ్వాలి

కార్మికులు పని శుభ్రంగా చేయాలంటే మాకు పని ముట్లు పూర్తి స్థాయిలో ఇవ్వాలి. కానీ ఉన్న పనిముట్లతో సర్దుకొని పని చేయాల్సి వస్తుంది. పనిముట్లు లేకుండా కాలువల్లో దిగి పనులు చేయడం వల్ల కార్మికులు అనేక రోగాల బారిన పడుతున్నారు. కార్మికుల ఆరోగ్యం గురించి పాలకులు, అధికారులు ఆలోచించాలి.

- జె.కామేష్, మున్సిపల్ కార్మికుడు

మహిళా దినోత్సవానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి-విజయనగరం

మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. మహిళా దినోత్సవ కార్యక్రమాల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో తన ఛాంబర్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 8వ తేదీ హోళీ సందర్భంగా సెలవు కావడంతో, 7వ తేదీనే జిల్లా కేంద్రంలోని ఆనందగజపతి ఆడిటోరియంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించాలని సూచించారు. దీనిలో భాగంగా మానవ హారం, బాల్య వివాహాల నిరోధంపై వీధినాటికల ప్రదర్శన, ఇతర సాంస్కతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. 9వ తేదీన మండల స్థాయిలో మానవ హారాలు, మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించాలని సూచించారు. అందుకుగాను మండలాల్లో 6వ తేదీనే సఖి గ్రూపు సభ్యులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి, 9వ తేదీన బహుమతి ప్రదానం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ మహిళా దినోత్సవం సందర్భంగా, బాల్య వివాహాల నిరోధంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, జెడ్‌పి సిఇఒ ఎం.అశోక్‌కుమార్, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి, మెప్మా పీడీ సుధాకరరావు, ఐసిడిఎస్ పీడీ బి.శాంతకుమారి, డిఇఒ బి.లింగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1న వేతనాలిచ్చేలా చట్టం చేయాలి

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ



మహాసభలో మాట్లాడుతున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వంలో భాగమైన ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించేలా చట్టం చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెఆర్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. సమయానికి జీతాలు ఇవ్వకపోతే ఆర్థిక ఇబ్బందులతో విధి నిర్వహణ ఎలా చేయగలుగుతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం విజయనగరంలోని కృషి భవనంలో జరిగిన ఆ సంఘం జిల్లా 5వ జిల్లా కౌన్సిల్ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ఒప్పందాలు అమలు చేయకుండా ఉద్యోగులు గొంతెమ్మ కోర్కెలు కోరుతున్నట్లు ప్రజలలో అపోహలు కలిగించేలా ప్రభుత్వం ప్రచారం చేయడం బాధాకరమన్నారు. విధి నిర్వహణలో అహర్నిశలూ శ్రమిస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షన్ దార్లు, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వాలని, రావలసిన ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో ఇవ్వాలని మాత్రమే ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఉద్యోగులు దాచుకున్న పిఎఫ్, ఎపిజిఎల్‌ఐఐ, ఇఎల్ వంటి ఆర్థిక ప్రయోజనాలు అందక పోవడం వలన అప్పులు చేసుకొని కార్యక్రమాలు చేసుకోవలసిన దుస్థితి వస్తోందని అన్నారు. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిస్థితులను గమనించి ఉద్యోగుల రావలసిన ఆర్థిక ప్రయోజనాలు చెల్లించాలని కోరారు. మార్చి 30వ తేదీలోగా సమస్యలు పరిష్కరించకపోతే ఏప్రిల్‌లో రాష్ట్ర కార్యవర్గం సమావేశమై పోరాటం చేస్తామని తెలిపారు. పిఆర్‌సి ఒప్పందాలు ఖచ్చితంగా అమలు పరచాలని,ఉద్యోగులకు రావలసిన ఆర్థిక ప్రయోజనాలు వెంటనే విడుదల చేయాలని, పాదయాత్రలో ఇచ్చిన హామి మేరకు సిపిఎస్ రద్దు చేయాలని, కాంట్రాక్టు, కంటింజెంట్ మరియు ఔట్ సోర్సింగ్, ఆర్ టిసి, గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షులు పి.రామచంద్రరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం ఉదాసీనతతో వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కంది వెంకటరమణ, యుగంధర్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగసాయి, రాష్ట్ర కార్యదర్శులు పిఎం జవహర్, విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు ఎస్‌వి రమణ, అర్‌టిసి రాష్ట్ర నాయకులు కేదారేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు మద్దతుగా ఉండే

కోరెడ్ల రమాప్రభను గెలిపిద్దాం

ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ



రమాప్రభ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యువజన, విద్యార్థి ఉద్యమాలకు అండగా ఉండి ప్రజాగళాన్ని శాసనమండలిలో వినిపించే పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రమాప్రభ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్, డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్.హరీష్ మాట్లాడారు. ఉత్తరాంధ్రలోని పట్టభద్రులంతా పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మహారాజా కళాశాలల పరిరక్షణకై జరిగే పోరాటాలలో మద్దతుగా నిలిచి, నిరాహార దీక్షల్లో పాల్గొన్నది పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కెఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు అని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎయిడెడ్ కళాశాలల పరిరక్షణకు శాసన మండలిలో గొంతెత్తింది కూడా పిడిఎఫ్ ఎమ్మెల్సీలేనని, జాబ్ లెస్ కాలెండర్ రద్దు చేసి నూతన జాబ్ కాలెండరు విడుదల చేయాలని నిరుద్యోగుల పోరాటాన్ని శాసన మండలిలో బలంగా వినిపించింది, నిరుద్యోగులకు న్యాయం చేయాలని, ప్రత్యక్షంగా,పరోక్షంగా పోరాడుతున్నది పిడిఎఫ్ ఎమ్మెల్సీలేనని తెలిపారు. వినాశకర నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా నిలబడి, రాష్ట్రంలో 3,4,5 తరగతుల విలీనానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేసింది, పోరాడింది వీరేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో స్మార్ట్ విలేజ్ యోజన పేరుతో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని లక్షల్లో డబ్బులు తీసుకుని మోసం చేసిన బిజెపి నాయకులను అరెస్టు చేసి, సిఐడి కేసు వరకూ తీసుకెళ్లింది, నిరుద్యోగుల పక్షాన నిర్విరామంగా పోరాడింది పిడిఎఫ్ ఎమ్మెల్సీలేనని తెలిపారు. కావున మనకోసం పోరాడిన, అనేక సేవా కార్యక్రమాలు చేసిన పిడిఎఫ్ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్.వెంకటేష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్.రామకృష్ణ, డివైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు బి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం

ఇసి ఆదేశాలు బేఖాతరు

ప్రజాశక్తి - సాలూరు

ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేయరాదని ఎన్నికల సంఘం అధికారి బుధవారం జిల్లా అధికారులను ఆదేశించింది. అయితే డిప్యూటీ సిఎం రాజన్నదొర నేతృత్వంలో వైసిపి నాయకులు గురువారం పట్టణంలోని పలు ప్రయివేటు పాఠశాలల్లో అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈనెల 13న జరుగుతున్న ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో వైసిపి అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. ఇప్పటికే వైసిపి నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలు, సచివాలయాలకు వెళ్లి ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఒకవైపు ఇసి ఆదేశాలను గాలికొదిలేసి అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు పట్టభద్రులను ప్రభావితం చేసే పనిలో ఉన్నారు.



మాట్లాడుతున్న సెయింట్ ఫౌండర్ చైర్మన్ మోహన్‌రెడ్డి

టెక్నాలజీని పెంపొందించాలి

సెయింట్ ఫౌండర్ చైర్మన్ మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-డెంకాడ

భారత దేశం ప్రపంచ స్థాయి ఆర్థిక వ్యవస్థగా మారిందని, అందుకు ధీటుగా ఆత్మ నిర్భర భారత్ ద్వారా యువత టెక్నాలజీని పెంపొందించే దిశగా యువత మారాలని సెయింట్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ బివిఆర్ మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. లెండి కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యాన జరిగిన సిఇఒ టాక్స్‌లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విప్లవాత్మకంగా టెక్నాలజీలో మార్పులను సంతరించుకునే దిశగా ముందుకు జరగాలని చెప్పారు. కళాశాలలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ లేబొరేటరీని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయనను సంస్థ చైర్మన్ పి.మధుసూదనరావు, వైస్ చైర్మన్ శ్రీనివాసరావు, కరస్పాండెంట్ కె.శివరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ వివి రామారెడ్డి సత్కరించారు.

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు

ప్రజాశక్తి-రేగిడి

ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలలో ఓటరు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎన్నికల జోనల్ అధికారి టి. చంద్రశేఖర్ సూచించారు. గురువారం ఉంగరాడ మెట్ట గురుకుల పాఠశాలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 26, 27 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరుకు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు వీలు కల్పించాలన్నారు.. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. 100 మీటర్ల పైబడి దూరంగా అభ్యర్థుల టెంట్లు ఉండాలన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 1408 ఓట్లు ఉన్నట్లు తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి తెలిపారు. వీరితోపాటు ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, ఆర్ఐ రేవతి ఉన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి - వంగర

గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని చీపురుపల్లి ఇఇ జి గౌరీ శంకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయాలు ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న పనులు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజాం నియోజకవర్గంలో 3,454 గృహాలు మంజూరు కాగా ఇందులో వంగర మండలానికి సంబంధించి 1750 గృహాలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ సమావేశంలో ఎఐబి పైడితల్లి, బాబీ పాల్గొన్నారు.

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు పడాల భూదేవి

ప్రజాశక్తి-సీతపేంట

విశాఖపట్నంలో మార్చి 3,4 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ - 2023 పేరుతో ఏర్పాటు చేస్తున్న పెట్టుబడిదారుల చర్చావేదిక సభకు సీతంపేట నుంచి నారీశక్తి పురస్కార గ్రహీత పడాల భూదేవికి స్పీకర్‌గా ఆహ్వానించారు. ఈ మేరకు వివిధ దేశాల నుంచి వచ్చిన పారిశ్రామికవేత్తల సమావేశంలో పెట్టుబడుల అవసరంపై మాట్లాడుతారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి మొదటి విడతలో మాట్లాడిన తర్వాత రెండో షెసెన్స్‌లో ఆధునిక వ్యవసాయ పనిముట్లు, స్థానిక వనరుల గురించి వివరించనున్నారు. అలాగే చిన్నతరహా పరిశ్రమలు గూర్చి కూడా మాట్లాడుతానన్నారు. చిరుధాన్యాలు పైనాపిల్, పసుపు, చెట్టు పనస, జీడీ, చీపుర్లు వంటి వాటిపై చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాల కల్పన, గిరిజన రైతులకు ప్రయోజనం కలుగుతుందనే విషయం తెలియజేస్తానని అన్నారు. దీనివల్ల ప్రజలకు, ప్రభుత్వానికి బహుళ ప్రయోజనాలున్న అంశాలపై సదస్సులో మాట్లాడతానన్నారు.



పశువులకు చికిత్స చేస్తున్న ఎడి చలపతిరావు

బల్లంకిలో పశువైద్యశిబిరం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బల్లంకి గ్రామంలో గురువారం పశువైద్య శిబిరం ఏర్పాటుచేశారు. 68 పశువులకు పశుసంవర్థక శాఖ ఎడి చలపతిరావు చికిత్సలు చేసి, రైతులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఇడి దీపాల ఏర్పాటు

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని సుందరాడ గ్రామంలో సర్పంచ్ ఎ.దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం వీధి దీపాలను ఏర్పాటు చేశారు. 20 రోజుల నుంచి లైన్‌మేన్ స్పందించకపోవడంతో రాజాం నుంచి సీనియర్ ఎలక్ట్రీషన్‌ను తీసుకొచ్చి కొత్తగా ఎల్‌ఇడి దీపాలు ఏర్పాటుచేశారు.

ఆత్మరక్షణపై అవగాహన


పాలకొండ రూరల్ : ఆకతాయిల దాడి నుంచి తమను తాము ఎలా రక్షించుకోవాలో జిల్లా దిశ పోలీసు స్టేషన్ ఎస్ఐ రేవతి విద్యార్థినులకు వివరించారు. పట్టణంలోని వెంకంపేట ఎంపియుపి పాఠశాలలో గురువారం విద్యార్థినిలకు పలు అంశాలను వివరించారు. సెల్ఫ్ డిఫెన్స్, దిశా యాప్ గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్, ఎస్ఒఎస్, పిల్లలపై లైంగిక వేధింపులు, తననుతాను ఎలా రక్షించుకోవాలనే అంశాలపై చక్కటి ఉదాహరణలతో చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ కానిస్టేబుల్ బి.సంధ్యారాణి, పాఠశాల హెచ్ఎం జి.పరంకుసంనాయుడు, సైన్స్ ఉపాధ్యాయుని వి.నాగమణి ఉన్నార్ను.

సచివాలయాల్లో పిఒ తనిఖీలు

సీతంపేట : మండలంలోని హడ్డుబంగి, సోమగండి, గోయిది, మండ సచివాలయాలను ఐటిడిఎ పిఒ బి.నవ్య గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా ప్రతిరోజు హాజరు వేయాలని సూచించారు. రికార్డులను విధిగా నిర్వహించాలన్నారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బంది హాజరును యాప్‌లో పరిశీలించారు. సిబ్బంది ఏకరూప దుస్తులు ధరించాలని, సమయపాలన పాటించాలని అన్నారు. ప్రజలకు ఎక్కువ సర్వీసులు అందించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆమె వెంట సిబ్బంది ఉన్నారు.

పిడిఎఫ్ గెలుపు.. ఉత్తరాంధ్రకు మలుపు

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల అభ్యర్థులను ఓడించండి
- ఓటర్లకు పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అభ్యర్థన
- పాడేరు ఏజెన్సీలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం



పాడేరులో ప్రచారం నిర్వహిస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

పిడిఎఫ్ గెలుపు.. ఉత్తరాంధ్రకు మలుపువంటిదని, ఈ ప్రాంత సమగ్రాభివృద్ధి కోసం శాసన మండలి వేదికగా కృషి చేసేందుకు తనకు అవకాశం కల్పించాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజ్ఞప్తి చేశారు. రాజకీయాలకు అతీతంగా జరగాల్సిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రాజకీయ రంగు పులుముకోవడం శోచనీయమని ఆమె తెలిపారు. ఈ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులను ఓడించాలని, విధానాలు, సమస్యలపై నిరంతర పోరాటాలు చేసే పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించడమే విద్యావంతులకు నిజమైన విజయమని పిలుపునిచ్చారు. గురువారం పాడేరు, అరకులోయ ప్రాంతాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా 250 సంఘాల మద్దతుతో తాను పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. పిడిఎఫ్ అభ్యర్థులను ఓడించాలని అధికారమంతా ఉపయోగించి, రాష్ట్ర ప్రభుత్వం అనేక అక్రమాలకు తెరతీసిందన్నారు. అడ్డగోలుగా ఓటర్ల నమోదు చేయించారని, ఎయు విసితోపాటు పలువురు ఎంఇఒలు, ఇతర అధికారులను ప్రత్యక్షంగా ఎన్నికల ప్రచారం చేయించి అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందన్నారు. కస్తూర్బా ఉద్యోగులను బెదిరించి, సమావేశపరిచి అధికార పార్టీ అభ్యర్థి ప్రచారానికి పూనుకున్నారని విమర్శించారు. అయితే చైతన్యవంతులైనపట్టభద్రుల ఓటర్లందరూ ఇలాంటి బెదిరింపులు, ప్రలోభాలకు లొంగకుండా ఈ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థినైన తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకం వల్ల ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రత్యేక ప్యాకేజీ కింద ఎనిమిదేళ్లలో కేంద్రప్రభుత్వం రూ.24 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా, కేవలం రూ.450 కోట్లు మాత్రమే కేటాయించిన కేంద్రప్రభుత్వాన్ని అధికార వైసిపితోపాటు ప్రధాన విపక్షం టిడిపి ప్రశ్నించలేకపోయిందన్నారు. విభజన హామీలఅమలు, విశాఖ కేంద్రంగా రైల్వేజోన్, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ, గిరిజన ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల కల్పన, సమగ్రాభివృద్ధి వంటిఅంశాల్లో రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేస్తున్నా ప్రశ్నించే పరిస్థితి లేదన్నారు. జిఒ 3 రద్దుతో విద్య, ఉద్యోగాల్లో ఏజెన్సీలోని గిరిజనులకు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. సబ్‌ప్లాన్ నిధుల మళ్లింపు, గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై తీవ్ర నిర్లక్ష్యం, గిరిజన హక్కులపై దాడి, గిరిజనుల భూములు, సహజ వనరులపై పెత్తనం, గిరిజన ఆశ్రమాల్లో సిబ్బంది కొరత, హెల్త్‌వాలంటీర్ల తొలగింపు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతోనే కాలయాపన వంటి చర్యలతో గిరిజనుల సంక్షేమం, మన్యప్రాంతాల అభివృద్ధిని ప్రభుత్వాలు నీరుగారుస్తున్నాయన్నారు. గిరిజన ప్రాంతాల అబివృద్ధి, సంక్షేమం, గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో తీరని అన్యాయం చేస్తున్న ప్రభుత్వాల చర్యలపై ప్రశ్నించాలన్నా, పోరాడి హక్కులను సాధించుకోవాలన్నా పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా పాడేరులోని పలు కార్యాలయాలు, పాఠశాలల్లో పట్టభద్రుల ఓటర్లను కలిసి స్వయంగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎపి గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స, మెడికల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శెట్టి నాగరాజు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు హరీష్, స్థానిక గిరిజన సంఘం నాయకులు ఎల్ సుందరరావు, బొజ్జన్న ఎస్ఎఫ్ఐ నాయకుడు నరేష్ పాల్గొన్నారు. అనంతరం ఆమె హుకుంపేట, అరకులోయ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం చేపట్టారు.

బాలికలను కాపాడండి



వేపాడ.. విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి ధరణి

ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

బాలికలను రక్షించండి.. బాలికలను కాపాడండి అని ఐసిడిఎస్ పీడీ బి.శాంతకుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లాలోని అన్ని కెజిబివిలు, గురుకుల విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమాజంలో బాలికల ప్రాముఖ్యత, పోషకాహారం, చదువు, వివాహ వయస్సు, వ్యక్తిగత పరిశుభ్రత, అత్యవస సమయాల్లో తనను తాను ఎలా కాపాడుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పూల్‌బాగ్ యుపిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ డి.పల్లవి, హెల్త్ ఎడ్యుకేటర్ పి.సుబ్బలక్ష్మి, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జామి : ఆడపిల్లలు చదువుకోవడంతో క్రమశిక్షణతోపాటు మెరుగైన, ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని హెల్త్ ఎడ్యుకేటర్ ఎన్.అనిల్ ప్రేమ్‌కుమార్ అన్నారు. గురువారం విజినిగిరి రామా స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ పాఠశాలలో బేటీ బచావో... బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ లింగ వివక్షత రూపు మాపాలంటే ఆడపిల్లలు విద్యావంతులు కావాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకొని, మంచి పద్ధతులను అలవరచుకునే విధంగా తయారు కావాలన్నారు. రతహీనత, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌వి భవాని, ఆరోగ్య సహాయకులు సత్యప్రసాద్, శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న కెజిబివిలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. పిహెచ్‌సి వైద్యాధికారి ఎ.ధరణి మాట్లాడుతూ బాలికా విద్యతో ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కెజిబివి ఎస్ఒ కిరణ్మయి, సిహెచ్ఒ ఆంజనేయులు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

డిఇఒ కోర్సుపై శిక్షణ

ప్రజాశక్తి-శృంగవరపు కోట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ద్వారా డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుపై ఉచిత శిక్షణ ఇస్తునట్లు కోఆర్డినేటర్ జి.ఈరన్న ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ చదివిన 18 నుంచి 28 ఏళ్ల యువతీ యువకులు ఈ ఉచిత శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. మూడు నెలల శిక్షణ అనంతరం ప్రముఖ కంపెనీలలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 7995691295 నంబరును సంప్రదించాలని కోరారు.

వైభవంగా రామాలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జాకేరు గ్రామంలో గురువారం రామాలయ తొమ్మిదో వార్షికోత్సవం ఘనంగా ప్రారంభమైనది. అర్చకులు సురేష్ శర్మ ప్రజలతో పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా శుక్ర, శనివారాల్లో ఎడ్లు, గుర్రపు పరుగు పోటీలు నిర్వహిస్తున్నారు.



ఆర్‌డిఒకు ఫిర్యాదు చేస్తున్న వైసిపి కౌన్సిలర్లు

చెరువుగట్టు ఆక్రమణలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని అమ్మిగారిచెరువు గట్టు ఆక్రమణలను తొలగించాలని వైసిపి కౌన్సిలర్లు ఇంటి గోవిందరావు, పి.ఉమ, ఎస్.బాబు కోరారు. ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని గురువారం ఆర్‌డిఒ పి.శేషశైలజ, తహశీల్దార్ రాజారావుకు వేర్వేరుగా వినతులు అందించారు. అమ్మిగారి చెరువు గట్టును ఆక్రమించి, నిర్మాణాలు చేపడుతున్నా చర్యలు తీసుకోవడం లేదన్నారు. బొబ్బిలి-బలిజిపేట రోడ్డును కూడా ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. ఆక్రమణలపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు వి.మనోజ్‌కుమార్, ఒమ్మి రామారావు, దిబ్బ గోపి, సిహెచ్ రాజగోపాల్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ తరలింపుపై ఆందోళన



ఆందోళన చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

పట్టణంలోని రెండు రైల్వేస్టేషన్‌లో ఒకటైన టౌన్ స్టేషన్‌ను తొలగిస్తారనే వార్తలు వస్తున్న నేపథ్యంలో పార్వతీపురం నియోజవర్గ టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ నాయకత్వంలో గురువారం టౌన్ రైల్వేస్టేషన్ ఎదుట పార్టీ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్‌లతో కలసి ఆందోళన నిర్వహించారు. ఈ సంధర్భంగా జగదీష్ మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుండి పార్వతీపురం పట్టణానికి, బెలగాం ప్రాంత ప్రజలకు అనువుగా ఉండేలా రెండు స్టేషన్‌లను ఏర్పాటు చేయగా, దీని వల్ల పార్వతీపురం ఎంతగానో అభివృద్ధి చెందిందని, రెండుస్టేషన్‌ల పరిధిలోని ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండేదని, తీరా జిల్లా కేంద్రంగా ఏర్పాటైన తరువాత కొందరు స్వార్థపరులైన వైసిపి నాయకులు స్థానిక ప్రజాసంఘాలు, రాజకీయపార్టీలు, విద్యార్థి ఉపాధ్యాయ, వర్తక, వ్యాపార, వాణిజ్య వర్గాలతో కనీసం చర్చించకుండా రైల్వేజోనల్, డివిజనల్ మేనేజర్‌లకు ఉత్తరాలు రాయడం వల్ల, వారు ప్రజల అభిప్రాయం తెలుసుకోకుండా, పార్వతీపురం టౌన్ స్టేషన్ మూసివేయడానికి నిర్ణయం తీసుకుని ఈ మేరకు డివిజనల్ మేనేజర్‌కు ఉత్తరాలు రాశారని అన్నారు. వైసిపి నాయకులు పట్టణాన్ని అభివృద్ది చేయకపోగా, పట్టణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకైన స్టేషన్ తొలగింపునకు కారకులయ్యారని అన్నారు. ఒక వేళ పార్వతీపురం టౌన్ స్టేషన్ తొలగింపు గానీ జరిగితే, వైసిపి నాయకులు ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

ఆరోపణలు అవాస్తం

దీనిపై స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు స్పందిస్తూ టౌన్ రైల్వే స్టేషన్ తొలగింపు అంటూ టిడిపి చేస్తున్న ప్రచారం అవాస్తవమన్నారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం ఇలాంటి అసత్య ప్రచారాలను టిడిపి నాయకులు ద్వారపురెడ్డి జగదీష్ చేస్తున్నారని, రెండో రేల్వే స్టేషన్ ఆధునీకరణ తప్ప తొలగింపు ఆలోచన మా ప్రభుత్వనికిగానీ, మా నాయకులకు గానీ లేదని అన్నారు. టిడిపి చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని అన్నారు.

చురుగ్గా రోడ్డు విస్తరణ పనులు

ప్రజాశక్తి-వేపాడ

సోంపురం జంక్షన్ నుంచి వేపాడ మీదుగా ఆనందపురం కూడలి వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ రోడ్డు విస్తరణ పనులకు రూ.39 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. అయినా, మూడేళ్లుగా రోడ్డు పనులు నత్తనడకన సాగాయి.. ప్రస్తుతం చిరతపాలెం జంక్షన్ నుండి తారురోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.



చేపడుతున్న తారురోడ్డు పనులు

5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని నరవ వద్ద ఉన్న ఆంధ్రప్రదేశ్ గురుకుల బాలికల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 5 నుంచి ఏప్రిల్ 4వరకూ దరఖాస్తులు చేసుకోవచ్చునని ప్రిన్సిపల్ పివి రమణమ్మ తెలిపారు. ప్రవేశ పరీక్షల ద్వారా 80 సీట్లును భర్తీ చేసేందకు అవకాశం ఉందన్నారు. మరింత సమాచారం కోసం https;///mjpabewreis.apefss.inలో సంప్రదించాలని ఆమె తెలిపారు. ప్రస్తుతం కేవలం ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉందన్నారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి ఇబిసి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చున్నారు.



చుక్కనీరు రాని కుళాయిలు

అలంకారప్రాయంగా కుళాయిలు

చుక్క నీరు రాక అవస్థలు

ప్రజాశక్తి-శృంగవరపు కోట

మండలంలోని చుక్కవానిపాలెంలో ఇంటింటి కుళాయిలు అలంకారప్రాయంగా మారాయి. చుక్క నీరు రాక తీవ్ర అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రతీ సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో చుక్కవానిపాలెంలో ఇంటింటి కుళాయిలను ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన కొద్ది రోజులు మాత్రమే తాగునీరు సరఫరా చేశారు. తర్వాత నీరురాక కుళాయిలు అలంకారప్రాయంగా మారాయి.

ఘనంగా ఖాదర్ బాబా గంధ మహోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సూఫీ మహాత్మ హజరత్ ఖాదర్ షా ఖాదర్ 64వ గంధ మహోత్సవం స్థానిక బాబామెట్ట దర్బార్‌లో గురువారం ఘనంగా ప్రారంభమైంది. ముందుగా నఖీబుల్ ఔలియా సూఫీ పీఠాధిపతి హజరత్ ముహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా ఖాదరీ బాబా ఆధ్యాత్మిక వారసులు సజ్జాద నషీన్ ముహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షా, విజయనగరం ఖాదరి బాబా దర్గా, దర్బార్ ముతవల్లి డాక్టర్ ఖలీలుల్లా షరీఫ్, ఎమ్.డి.జాఫర్ షరీఫ్ ఉర్స్ ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు. దర్బార్‌లో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం ఫకీర్ మేళాలతో ఊరేగింపుగా ఖాదర్ బాబా దర్గాకు భక్తుల కోలాహలం మధ్య బయలు దేరారు. అక్కడ చాదర్ సమర్పించి, ఉరుసు ఉత్సవం ప్రారంభ సూచికగా జెండా మహోత్సవం నిర్వహించారు. అట్టహాసంగా జరిగిన ఈవేడుకల్లో వేలాదిమంది భక్తులు వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చి పాల్గొన్నారు.. అనంతరం భారీ అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సజ్జాద నషీన్ ముహమ్మద్ ఖ్వాజా మొహియుద్దీన్ మాట్లాడుతూ ఆపన్నులకు సాయం చేస్తూ అన్నార్తులను ఆదరిస్తూ శాంతి సౌభ్రాతత్వానికి సూఫీ ధర్మం నిర్వచనం చెబుతోందని అన్నారు.



ప్రార్థనలు చేస్తున్న ఖలీలుల్లా షరీఫ్, జాఫర్ తదితరులు